# పంచతంత్రం

సరళ వ్యావహారికంలో సమగ్ర కథనం



అయలసోమయాజుల నీలకంఠేశ్వర జగన్నాథశర్మ

# పంచతంత్రం

## సరళ వ్యావహారికంలో సమగ్ర కథనం

అనుసృజన

అయలసోమయాజుల నీలకంఠేశ్వర

**జగన్నాథశర్మ**

**అమరావతి పబ్లికేషన్స్**

**సాయిబాబా రోడ్ - గుంటూరు - 522 007**

# PANCHATANTRAM

*by* **A.N.JAGANNADHA SARMA**

---

**పంచతంత్రం**

**జగన్నాథశర్మ**

ప్రథమ ముద్రణ

**జనవరి 2013**

**© రచయిత**

టైటిల్ డిజైన్ : **రమణజీవి**

లోపలి బొమ్మలు : **పినిశెట్టి**

లే అవుట్ డిజైన్ : **కె. రామకృష్ణ**

ప్రచురణ

**అమరావతి పబ్లికేషన్స్**

4-21-81, చైతన్యపురి, సాయిబాబా రోడ్,

**గుంటూరు**-522 007 ఫోన్: 0863-2333323

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్**

**విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్**, హైదరాబాద్

**ప్రతులకు**

**విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు**

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం,

గుంటూరు, తిరుపతి, ఒంగోలు, హనుమకొండ, కాకినాడ, కరీంనగర్, శ్రీకాకుళం

**ముద్రణ: శ్రీ కళాంజలి గ్రాఫిక్స్**, హైదరాబాద్

వెల : **రూ.** 160

## కృతజ్ఞతలు

ఈ పంచతంత్రాన్ని నవ్యవీక్లీలో ప్రచురించి ప్రోత్సహించిన ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ **శ్రీ వేమూరి రాధాకృష్ణగారికి** హృదయపూర్వక కృతజ్ఞతలు.

## అంకితం

మా అమ్మాయి **చైతన్యదీప్తికి**
మా అబ్బాయి **సంతోష్ కుమార్‌కి**
ప్రేమతో....

**–రచయిత**

# ఇదీ తంత్రం


**విష్ణుశర్మ** .... 07

I. **మిత్రలాభం** .... 10

*బాటసారి - బంగారు కడియం-11, మంచి మిత్రులు-14,*
*జింక-నక్క కథ-18, గుడ్డిగద్ద కథ-20, చెరపకురా చెడేవు-23,*
*హిరణ్యకుడి కథ-29, చిత్రాంగుడి కథ-35*

II. **మిత్రభేదం** .... 40

*కరటక దమనకులు-40, కుక్క-గాడిద కథ-44,*
*ఎద్దు-సింహం స్నేహం-48, ఆషాఢభూతి కథ-52,*
*కాకి-పాము కథ-56, ముసలి కొంగ కథ-56,*
*కుందేలు-సింహం కథ-60, నల్లి- పేను కథ-67,*
*కాకి కుట్ర-68, సింహం-ఒంటె కథ-70,*
*వడ్రంగి-సింహం కథ-75, తీతువు పిట్ట-సముద్రం-77,*
*హంస-తాబేలు కథ-78, మూడు చేపల కథ-81,*
*నందిగుప్తుని కథ-87, ఇంద్రపాలితుడి కథ-95*

III. **విగ్రహం** .... 101

*కుందేలు-కోతుల కథ-104, పావురం-డేగ కథ-106,*
*గాడిద కథ-108, కుందేలు-ఏనుగు కథ-110,*
*కాకి-హంస కథ-116, నక్కమారాజు కథ-120,*
*కాకి-గుడ్లగూబ కథ-129, పిల్లి-ఎలుక కథ-137*

IV. **సంధి** .... 149

*పాము-వర్తకుని కథ-150, పిట్టపోరు-పిల్లి తీర్పు-151,*
*కలల బ్రాహ్మణుని కథ-154, అమాయక బ్రాహ్మడు - దొంగల కథ-158,*
*కోతి-మొసలి కథ-158, నక్క-తాబేలు కథ-163, కప్పలు - పాము కథ-166,*
*దేవశర్మ-ముంగిస కథ-170*

V. **అపరిక్షీతకారిత్వం** .... 175

*క్షురకుని కథ-176, అంతులేని అత్యాశ కథ-180,*
*సింహ కారకుల కథ-184, రెండు చేపల కథ-186,*
*గాడిద కథ-187, నేత కార్మికుని కథ-189, చంద్రభూపతి కథ-191*

# విష్ణుశర్మ

అనగనగా ఓ రాజు. ఆ రాజు పేరు సుదర్శనుడు. అతనికి చెప్పుకోలేని కష్టం వచ్చి పడింది. అదేమిటంటే... ముగ్గురు కొడుకులున్నారతనికి. ఆ కొడుకులికి ఆటలంటే ఇష్టం. పాటలంటే ఇష్టం. చదువంటే ఇష్టం లేదు. బాగా చదువుకుని, శాస్త్రాలని ఒంటబట్టించుకుంటేనే గదా, గొప్పవారూ, రేపటి రాజులవుతారు. కాని చదువంటేనే ఇష్టం లేదు వాళ్ళకి. అలా అని శుద్ధ మొద్దులా అంటే అదీ కాదు, బుద్ధిమంతులే!

రాజుగారు ఈ బాధలోనే కొలువు తీరారు. పండితులతోనూ, విద్వాంసులతోనూ రకరకాల చర్చలు చేశారు. ఆ సందర్భంలో ఓ పండితుడు ఇలా అన్నాడు.

''మనిషి డబ్బుతోనూ, అధికారంతోనూ, యవ్వనంతోనూ, అవివేకంతోనూ జాగ్రత్తగా ఉండాలి. లేని పక్షంలో ఈ నాలుగింట దేనితోనయినా చెడిపోయే ప్రమాదం ఉంది. కలగలిసి నాలుగూ ఉన్న వాడూ ఇట్టే చెడిపోతాడు. అందుకనే మనిషన్నవాడు బాగా చదువుకోవాలి. చదువుకుంటే తెలివితేటలూ, వివేకజ్ఞానం అలవడి, చెడిపోకుండా ఉంటాడు. మనిషికి విద్య కన్నులాంటిది. ఆ కన్ను లేకపోతే కష్టం. బతుకంతా చీకటే''.

పండితుని మాటలతో రాజు బాధ రెట్టింపయింది. కొలువు చాలిస్తున్నామని చెప్పి, చరచరా అంతఃపురానికి వెళ్ళిపోయాడు. రాజు, కొలువుని ఇలా మధ్యలో ముగించిన సందర్భాలు లేవు. ఉత్సాహంగా కొలువు తీరే రాజు, ఇటీవల నిరుత్సాహంగా కొలువు తీరడం, ఏదో బాధలో ఉన్నట్టుగా కనిపించడం పండితుల్నీ, విద్వాంసుల్నే కాదు, మంత్రి రాజదత్తుణ్ణి కూడా కలచి వేసింది.

పిల్లల అరుపులూ కేకలూ వినవస్తోంటే అంతఃపురం కిటికీలో నుండి కిందకి చూశాడు రాజు. ఉద్యాన వనంలో తన ముగ్గురు కొడుకులూ అల్లరిగా ఆడుకోవడం కనిపించింది. కన్నీళ్ళొచ్చాయతనికి. ఎంచక్కా చదువుకున్నవారు పిల్లలు కాని, వీళ్ళేం పిల్లలు? వీళ్ళ వల్ల తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు రావు సరికదా, దుఃఖం ముంచుకొస్తుంది. తళుకు బెళుకు రాళ్ళు తట్టెడు ఉండడం కన్నా, ఒక్క రత్నం చాలంటారు. అలాగే కౌరవ సంతానంలా వందమంది మూర్ఖులు కొడుకులుగా ఉండే కంటే ఒక్కడు... ఒక్కడంటే ఒక్కడు గుణవంతుడు, ధర్మరాజులాంటి వాడు ఉంటే చాలనుకున్నాడు రాజు. దేనికయినా ప్రాప్తం ఉండాలి. గుణవంతులూ, విద్యావంతులూ అయిన పిల్లలుండాలంటే గతజన్మలో ఎంతో పుణ్యం చేసుకుని ఉండాలనుకున్నాడు. అంతలోనే కళ్ళు తుడుచుకుని, దీర్ఘంగా ఆలోచించసాగాడు.

బాధపడి లాభం లేదు. పరిష్కారమార్గాన్ని కనుక్కోవాలనుకున్నాడు. మంచి గురువుల దగ్గర చదివిస్తే పిల్లలెందుకు చదవరు? చదవనని వారనలేదే! చదివించడం లేదు కాబట్టే వారాడుతున్నారు. తప్పు తనదే!

గారాబం చేసి, అప్పుడే పిల్లలకు చదువులెందుకనుకుంటూ నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు బాధపడడంలో అర్థం లేదనుకున్నాడు. పిల్లలకు చదువు చెప్పించడం తల్లిదండ్రుల బాధ్యత. సరయిన గురువు దగ్గర వారిని చదివించాలి. చదివించకపోవడం నేరం కూడా అనుకున్నాడు. పుట్టుకతోనే ఎవరూ పండితులు కారు. విద్వాంసులు అంతకన్నా కారు. బాగా చదువుకుని పండితులవుతారు. తర్వాత్తర్వాత విద్వాంసులుగా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జిస్తారు. ప్రయత్నించాలి. ప్రయత్నిస్తేనే ఏదయినా ఫలిస్తుందనుకున్నాడు. వూరికే దిగులుపడి ప్రయోజనం లేదు. అడవికి రాజయినా సింహం వేటాడే ఆకలి తీర్చుకుంటుంది. రాజునని నోరు తెరచి కూర్చుంటే పనిమాలా ఏ జంతువూ వచ్చి నోట్లో పడదనుకున్నాడు. పిల్లలకి త్వరలోనే మంచి గురువుని వెదకాలనుకున్నాడు.



మర్నాడు కొలువు తీరాడు రాజు. ఉత్సాహంగా కనిపించాడు. అతనలా ఉత్సాహంగా కనిపించడంతో పండితులకీ, విద్వాంసులకీ సంతోషమనిపించింది. అందరికీ నమస్కరించాడు రాజు. ఇలా అడిగాడు.

''ఆటలలో మునిగి తేలుతూ చదువన్నదే పట్టించుకోని నా పిల్లలకి, రేపటితరం రాజులకి నీతిశాస్త్రాన్ని బోధించాలి. వారిని నన్ను మించేలా తీర్చిదిద్దాలి. అలా తీర్చిదిద్దే సమర్థత కలవారు మీలో ఉన్నారా?''

ఉన్నారని చెప్పేందుకు ఎవరికీ ధైర్యం చాలలేదు. రాజు భయపడసాగాడు. అంతలో ఓ పండితుడు లేచి నిల్చున్నాడు. అతని పేరు విష్ణుశర్మ.

''రాకుమారులకు నీతిశాస్త్రాన్ని నేను బోధిస్తాను మహారాజా'' అన్నాడతను. ఆనందంగా చూశాడు రాజు.

''కొంగకు మాటలు నేర్పడం కష్టంకాని, చిలుకకు మాటలు నేర్పడం కష్టం కాదు మహారాజా! రాకుమారులు చిలుకలవంటివారు. అలాగే వజ్రాల గనిలో గాజుపెంకులుండవు. అంటే...మీ రాజవంశంలో గుణహీనులు ఉండే అవకాశం లేదు.''

పొంగిపోయాడు రాజు.

''వజ్రాన్నయినా సాన పెడితేనే ప్రకాశిస్తుంది. అలాగే ఎంత రాకుమారులయినా వారికీ తగిన గురువు అవసరం. ఆ గురువుని నేనేనని నాకనిపిస్తోంది. అన్యథా భావించక రాకుమారులను ఓ ఆరు నెలలపాటు నాకు అప్పగిస్తే నేను వారిని మంచి మార్గంలో పెడతాను. విద్యాబుద్ధులు నేర్పుతాను.'' అన్నాడు విష్ణుశర్మ. సింహాసనం మీద నుంచి లేచి నిల్చున్నాడు రాజు. గబగబా నాలుగడుగుల్లో విష్ణుశర్మను సమీపించాడు.

అతని చేతులందుకున్నాడు. ఇలా అన్నాడు.

''తిరుగులేదు. మీ వంటి పండితుల దగ్గర విద్య నేర్చుకుంటే నా కుమారులకు తిరుగులేదు. యోగ్యులవుతారు. పూలు కట్టిన దారానికీ పూల సుగంధం అబ్బినట్టు, సజ్జనునితో తిరిగిన సామాన్యుడు కూడా సజ్జనుడు అయినట్టుగా నా కొడుకులు మీ శిష్యరికంలో గొప్పవాళ్ళవుతారు. అనుమానం లేదు. ఈ క్షణం నుంచి రాకుమారుల్ని మీ చేతుల్లో ఉంచుతున్నాను. వారి కళ్ళు తెరిపించాల్సిన బాధ్యత మీదే''.

''తప్పకుండా'' అన్నాడు విష్ణుశర్మ.

ఓ మంచి ముహూర్తాన రాకుమారుల్ని వెంటబెట్టుకుని వెళ్ళాడు. వారిలో ఒకడిగా ఆడి పాడి, తర్వాత వారితో ఇలా అన్నాడు విష్ణుశర్మ.

''ఆడాడి బాగా అలసిపోయాం కదా! ఇప్పుడు మనం కథలు చెప్పుకుందాం. మంచికథలు, నీతికథలు చెప్పుకుందాం. మిత్రలాభం, మిత్రభేదం, విగ్రహం, సంధి, అపరిక్షీతకారిత్వం అంటూ రకరకాల కథలు చెప్పుకుందాం. మీకిష్టమేనా?''

''ఇష్టమే'' అన్నారు రాకుమారులు.

విష్ణుశర్మ కథలు చెప్పడం ప్రారంభించాడు.

# మిత్రలాభం

''రాకుమారులారా! మన దగ్గర డబ్బు లేకపోయినా, మందీ మార్బలం లేకపోయినా పర్వాలేదు. మంచివాళ్ళు నలుగురు స్నేహితులుగా ఉంటే అదే పదివేలు! స్నేహితులుంటే అనుకున్న పనులు ఇట్టే సాధించుకోవచ్చు. పూర్వం ఓ కాకి, తాబేలు, జింక, ఎలుక స్నేహంగా ఉంటూ సుఖంగా జీవించాయి. వాటి గురించి ఓ కథ ప్రచారంలో ఉంది. వింటారా?'' అడిగాడు విష్ణుశర్మ.

''చెప్పండి, వింటాం'' అన్నారు రాజకుమారులు.

విష్ణుశర్మ ఇలా చెప్పసాగాడు.

# బాటసారి - బంగారు కడియం

అనగనగా ఒక అడవి. ఆ అడవిలో ఓ మర్రిచెట్టు. ఆ చెట్టు మీద ఎన్నో...ఎన్నెన్నో పక్షులు ఉంటున్నాయి. ఆ పక్షుల్లో ఓ కాకి కూడా ఉంది. దాని పేరు లఘుపతనకం.

ఒక రోజు తెల్లవారు జామునే వేటగాడొకడు అడవిలో నూకలు చల్లి, వాటిపై వలపన్నాడు. వలపన్ని చెట్టు చాటుగా దాక్కున్నాడు. తెల్లగా తెల్లారింది. పావురాలు కొన్ని ఆకాశంలో ఎగురుతూ కింద భూమి మీది నూకల్ని చూశాయి. ఆకలనిపించింది వాటికి. తినాలని ఆశపడ్డాయి. కిందికి గుంపుగా దిగసాగాయి.

''ఎక్కడికి?'' అడిగాడు చిత్రగ్రీవుడు. అతను ఆ పావురాల రాజు.

''కింద నూకలున్నాయి. తిందాం'' అన్నాయి పావురాలు.

''ఆగండాగండి'' హెచ్చరించాడు చిత్రగ్రీవుడు. ఆగాయి పావురాలు.

''తొందరపడవద్దు! మనుషులే కనిపించని ఈ అడవిలో నూకలు ఎక్కణ్ణుంచి వస్తాయి? ఇందులో ఏదో మోసం ఉంది. వద్దు! మనం ఆ నూకల కోసం ఆశపడవద్దు'' అన్నాడు చిత్రగ్రీవుడు.

''ఇలా ఆశపడే పూర్వకాలంలో ఒక బాటసారి పులి నోటికి చిక్కి మరణించాడు'' అన్నాడు.

''అలాగా'' ఆశ్చర్యపోయాయి పావురాలు.

''అవును! మీకు ఆ కథ చెబుతాను వినండి'' అంటూ కథ చెప్పసాగాడు చిత్రగ్రీవుడు.

ఓ పెద్ద చెరువు ఉంది. ఆ చెరువు గట్టున ఓ పొద ఉంది. ఆ పొదలో ముసలి పులి ఒకటి నివసిస్తోంది. గట్టు మీద నుంచి ఓ బాటసారి పోతున్నాడు. అతన్ని చూసింది పులి.

''ఇదిగో'' అని కేకేసింది.

పిలుస్తున్నది ఎవరా? అని చూశాడు బాటసారి. పులి పిలుస్తోంది. భయపడ్డాడతను.

''భయపడకు! చూశావా, నా చేతిలోని బంగారు కడియం. దీనిని నీలాంటి పుణ్యాత్ముడికి ఇవ్వాలని కోరిగ్గా ఉంది. అందుకే పిలిచాను. చెరువులో స్నానం చేసి, శుచిగా రా! ఈ బంగారు కడియాన్ని తీసుకో'' అంది పులి. బంగారు కడియాన్ని వేళ్ళ మధ్య ఉంచి ఆడించసాగింది. బాటసారి కడియాన్ని చూశాడు. బాగుందది. మెరుస్తోంది. మంచి బంగారమే! అనుమానం లేదు. అయితే కడియం కోసం పులిని నమ్మి దగ్గరగా వెళ్తే ఇంకేమయినా ఉందా? తనని తినేయదూ అనుకున్నాడు. అయినా బంగారాన్ని వదులుకోలేక పోతున్నాడు. ఓ పక్క ప్రాణం, మరో పక్క బంగారం. ఏం చేయాలో అంతుచిక్కట్లేదు బాటసారికి. ఆ అంతుచిక్కని స్థితిలోనే పులితో ఇలా అన్నాడు బాటసారి.

''నువ్వేమో క్రూరజంతువు. నేనేమో మనిషిని. నీ దగ్గరకు రావాలంటేనే భయంగా ఉంది. నిన్నెలా నమ్మను చెప్పు?''

అతనికి ఆశను కల్పిస్తున్నట్టుగా కడియాన్ని గాలిలోకి ఎగరేసి అందు కుంది పులి.

''బంగారం కోసం ప్రాణాన్ని పణం పెట్టలేను. నీ దగ్గరకి రాను, రాలేను'' అన్నాడు.

''నువ్వన్నది నిజమే! నేను క్రూర జంతువునే! నన్ను చూసి నువ్వు భయ పడడంలో తప్పులేదు. అయితే యవ్వ నంలో నేను చాలా పాపాలు చేశాను. ఎన్నో జంతువుల్నీ, ఎందరో మను షుల్నీ పొట్టన పెట్టుకున్నాను. చేయ రాని పనులన్నీ చేశాను. ఆ పాపాల్ని పోగొట్టుకునేందుకే ఈ కడియం. దీన్ని నీలాంటి పుణ్యా త్ముడికిచ్చి, పాపాల్ని కడిగేసుకోవాలనే నా తాప త్రయం. అర్థం చేసుకో నన్ను'' అన్నది పులి.



అయినా ముందుకు అడుగు వేయలేకపోయాడు బాటసారి.

''ముసలిదాన్ని. లేవలేను. పరిగెత్తలేను. చేతి గోళ్ళూ, కాలి గోళ్ళూ రెండూ మొద్దుబారిపోయాయి. పళ్ళూడిపోయాయి. కళ్ళు కూడా సరిగా కనిపించడం లేదు. మాంసం అన్న ముచ్చటే లేదు. మాంసం తినడాన్ని ఎప్పుడో మానుకున్నాను. పండ్లూ కాయలూ తిని బతుకుతున్నాను. నా అవతారం చూశావు కదా! నమ్మకం కలగడం లేదా? నా గురించి లేనిపోనివి ఆలోచించి భయపడకు. రా! ముందు ఆ చెరువులో స్నానం చెయ్'' అన్నది పులి.

దాని మాటలు నమ్మాడు బాటసారి. పులి మాటలు నమ్మాడనడం కన్నా, బంగారం మీద ఆశ ఎక్కువయిందతనికి. బంగారు కడియం కళ్ళ ముందు కదలాడుతోంటే స్నానం చేసేందుకు చెరువులోనికి దిగాడు. బురద బురదగా ఉంది లోపల. కాలు పెడితే జారిపోతున్నాడు. అయినా తెగించాడు. అంతే! బురదలో దిగబడిపోయాడు. కాలు తీద్దామంటే రావట్లేదు. భయపడ్డాడు.

''రక్షించండి బాబో, రక్షించండి'' కేకలేశాడు.

''అరవకు. నేనున్నానుగా! నేను నిన్ను రక్షిస్తాను'' అంది పులి. చేతిలోని కడియాన్ని జాగ్రత్త చేసి, అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా వచ్చి చిక్కిన బాటసారి మీద ఒక్కసారిగా దూకింది. అతన్ని చంపి, కండలూ గుండెలూ తిని కడుపు నింపుకుంది.

–కథ ముగించాడు చిత్రగ్రీవుడు.

''అందుకే దురాశ పనికి రాదంటారు. దురాశకు పోతే ప్రాణాలే బలి పెట్టాల్సి వస్తుంది. అడవిలో నూకల కోసం ఆశపడితే మనకీ అదే గతి పడుతుంది. అందుకే వద్దంటున్నాను'' అన్నాడు చిత్రగ్రీవుడు.

''ఇలాంటి కథలు చాలా విన్నాం'' అందో ముసలి పావురం.

''నీకన్నీ అనుమానాలే! నీ అనుమానాల్తో ఆకలి తీరదు. ఎదురుగా ఉన్న ఆహారాన్ని కాదనుకుని, ఏవేవో ప్రమాదాలు ఊహించుకోవడం అవివేకం. తిరిగి తిరిగి అలసిపోయాం. నూకలు దొరికాయా? లేదు. తీరా దొరికితే వద్దనుకోవడం నా వల్ల కాదు. నేను కిందికి దిగుతున్నాను. నాతో పాటు దిగే వాళ్ళు దిగండి. లేదంటే మీ ఇష్టం'' కిందికి దిగేసింది ముసలి పావురం. ఆకలితో ఉన్నాయేమో! మిగిలిన పావురాలు కూడా 'దిగండి దిగండి' అంటూ ఒకదానికొకటి చెప్పుకుని కిందికి దిగాయి. తప్పనిసరిగా చిత్రగ్రీవుడు కూడా దిగాల్సి వచ్చింది. అన్నీ వలలో చిక్కుకున్నాయి.

''అయ్యయ్యో వలలో ఇరుక్కున్నాం'' అన్నాయి పావురాలు. ముసలి పావురాన్ని 'నీ వల్లే, నీ వల్లే ఇదంతా' అంటూ దాన్ని అనరాని మాటలన్నాయి. తిట్టి తిట్టి పోశాయి.

''చిత్రగ్రీవుడు చెబుతూనే ఉన్నాడు. పట్టించుకోలేదు. అనుభవించాల్సిందే'' అన్నాయి. కన్నీళ్ళు పెట్టుకున్నాయి.

''బాధపడకండి! తప్పు మీదీ కాదు, అలాగే ఆ ముసలి పావురానిదీ కాదు, తప్పంతా ఆకలిది. ఆకలిని తట్టుకోలేక దిగాం. వలలో చిక్కుకున్నాం. ఇప్పుడు ఏడ్చి లాభం లేదు. ఆలోచించాలి. బాగా ఆలోచించి, ఇక్కణ్ణుంచి తప్పించుకునే ఉపాయాన్ని కనిపెట్టాలి'' అన్నాడు చిత్రగ్రీవుడు. ఆలోచనలో పడ్డాడు. ఇంతలో దగ్గరగా వస్తోన్న బోయని చూసి ముసలి పావురం గగ్గోలుగా అరిచింది.

''అడుగడుగో, బోయ వచ్చేస్తున్నాడు. చూడండి చూడండి'' చూశాడటు చిత్రగ్రీవుడు. చూస్తూనే ఏదో ఆలోచన తట్టిన వాడై పావురాలతో ఇలా అన్నాడు.

''ఇప్పుడు ఈ క్షణం ఇక్కణ్ణుంచి మనందరం తప్పించుకోవాలంటే ఒకటే మార్గం ఉంది. అందరం ఒక్కసారిగా పైకెగరాలి. వలతో పాటుగా ఎగరాలి. ఎగిరితే బోయనుంచి మనం తప్పించుకోగలం. దీన్నే ఐకమత్యం అంటారు. ఐకమత్యాన్ని మించిన బలం లేదు. ఏమంటారు?''

''నువ్వెలా చెబితే అలాగే'' అన్నాయి పావురాలు.

''నేను ఒకటి రెండు మూడు అంటాను. మూడనగానే అందరూ పైకి లేవాలి''.

''లేస్తాం''.

''అయితే సరే! ఒకటి రెండు మూడు'' అంటూనే అందరితో పాటుగా పైకి లేచాడు చిత్రగ్రీవుడు. వలతో పాటుగా పావురాలన్నీ పైకి లేచాయి. ఆకాశంలో ఎగరసాగాయి. పావురాలతో పాటుగా తన వల కూడా ఎగిరిపోవడాన్ని చూస్తూ బోయ ఆశ్చర్యపోయాడు. పావురాలు పోతే పోయాయి. తన వల దొరికితే చాలను కున్నాడు. 'ఉష్ ఉష్! ఏయ్ ఏయ్' అంటూ కేకలేశాడు. పావురాలను చూస్తూ కింద పరుగుదీశాడు. పరుగుదీసి పరుగుదీసి అలసిపోయేడే తప్ప, అతనికి పావురాలు చిక్కలేదు. వల కూడా దక్కలేదు. దాంతో బోయ తల పట్టుకుని ఇంటి దారి పట్టాడు.

# మంచి మిత్రులు

**చి**త్రగ్రీవుడు చెప్పిన మేరకు పావురాలన్నీ ఒక్కసారిగా పైకి లేచాయి.

వలతో పాటుగా ఆకాశంలోకి ఎగిరిపోయాయి. జరిగిందంతా మొదటి నుంచీ గమనిస్తున్న లఘుపతనకుడు అనే కాకి, ఈ పావురాలు ఎక్కడికి వెళ్తున్నాయి? వల నుంచి ఎలా తప్పించుకుంటాయి? ఇదేదో చూడదగ్గదే అనుకుని అది కూడా ఆకాశంలోకెగిరి, పావురాలను అనుసరించింది.

''ఇలా ఎంత దూరం ఎగరాలి? ఎక్కడికని ఎగరాలి?'' చిత్రగ్రీవుణ్ణి ప్రశ్నించాయి పావురాలు.

''గండకీనది వరకూ ఎగరాలి. దాని ఒడ్డున విచిత్రవనమనే అడవి ఉంది. అక్కడికి మనం చేరుకోవాలి.'' అన్నాడు చిత్రగ్రీవుడు.

''అక్కడికి ఎందుకు?'' అడిగింది ఓ పావురం.

''ఎందుకంటే...అక్కడ నా మిత్రుడు ఉన్నాడు. హిరణ్యకుడు అని అతను ఎలుకల రాజు. అతను మనల్ని కాపాడతాడు. లోకంలో తల్లీ, తండ్రీ, స్నేహితుడూ ఈ ముగ్గురే కాపాడతారు. మిగిలిన వారు కాపాడ గలిగే అవకాశం ఉందికాని, వారికి మనతో అవసరం ఉండాలి. ఉంటేనే కాపాడతారు. లేకపోతే కాపాడరు'' అన్నాడు చిత్రగ్రీవుడు.

''నిజమే'' అన్నాయి పావురాలు.

''హిరణ్యకుణ్ణి కలిస్తే, అతను ఈ వలను కొరికి ముక్కలు చేస్తాడు. మనం అప్పుడు తప్పించుకోవచ్చు'' అన్నాడు చిత్రగ్రీవుడు.

''అయితే ఇంకేం! పదండి, పదండి'' అన్నాయి పావురాలు. ఎగరడంలో వేగాన్ని పెంచాయి. వారిని వెన్నంటి వస్తున్న లఘుపతనకుడు కూడా వేగాన్ని పెంచాడు. గండకీనది కనిపించింది. విచిత్రవనం కూడా కనిపించింది. ఒక్కసారిగా పావురాలన్నీ కిందికి దిగాయి. హిరణ్యకుడి కలుగు దగ్గర వాలాయి. రెక్కల టపటపలూ, పావురాల గోలకి కలుగులోని హిరణ్యకుడు ప్రమాదమేదో ముంచుకొచ్చిందని భయపడ్డాడు. కలుగులోనికి మరింతగా వెనక్కి జరిగాడు. కూడదీసుకుని కూడదీసుకుని కలుగు ముందుకు వచ్చాడు చిత్రగ్రీవుడు.

''మిత్రమా'' అని పిలిచాడు. పరిచయమయిన గొంతులా అనిపించి కొంచెం ముందుకు వచ్చాడు హిరణ్యకుడు.

''నేను మిత్రమా! నీ మిత్రుణ్ణి. చిత్రగ్రీవుణ్ణి. నీ సహాయం కోరి వచ్చాను. దయచేసి బయటికి రా'' అన్నాడు చిత్రగ్రీవుడు. అతని మాట పూర్తికానేలేదు. ఆనందంగా కలుగులోంచి బయటకు వచ్చాడు హిరణ్యకుడు. చిత్రగీవుణ్ణి చూసి ఆనందించాడు.

''ఎన్నాళ్ళకెన్నాళ్ళకు మిత్రమా! నిన్ను చూడ్డం నాకు చాలా ఆనందంగా ఉంది'' అన్నాడు. అంతలోనే మిత్రుడు వలలో చిక్కుకుని ఉండడాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

''ఇదేమిటిది? వలలో చిక్కుకున్నావు'' అనడిగాడు. సమాధానం చెప్పే లోపే చిత్రగ్రీవుణ్ణి వలనుండి తప్పించేందుకు ప్రయత్నించాడు. వలను కొరకసాగాడు.



''ఆగాగు! నన్ను విడిపించడం కాదు, ముందు నావాళ్ళను విడిపించు. తర్వాత నన్ను విడిపించవచ్చు'' అన్నాడు చిత్రగ్రీవుడు. రాజుగా తోటి వారిని కాపాడడం ప్రథమ కర్తవ్యం అనుకున్నాడతను.

''పూర్వజన్మలో ఏ పాపం చేశామో! అందరం ఇలా వలలో చిక్కుకున్నాం. పాపం, పుణ్యం కాదుగాని, బుద్ధిగా ప్రవర్తించలేకపోయాం. ఫలితంగా శిక్ష అనుభవిస్తున్నాం'' అన్నాడు చిత్రగ్రీవుడు. వల కొరక్కుండా ఆలోచిస్తోన్న హిరణ్యకుణ్ణి చూశాడు.

''ఏమిటాలోచిస్తున్నావు మిత్రమా?'' అడిగాడు.

''ఏం లేదు మిత్రమా! నా పళ్ళు కొంచెం ఇబ్బంది పెడుతున్నాయి. నొప్పెడుతున్నాయి. మొత్తం వలంతా కొరకడం అంటే కష్టమనిపిస్తోంది. ముందు నిన్ను విడిపించనీ! తర్వాత సంగతి తర్వాత ఆలోచిద్దాం'' అన్నాడు హిరణ్యకుడు. చిత్రగ్రీవుడికి హిరణ్యకుడి మాటలు నచ్చినట్టు లేదు. అదోలా చూశాడతన్ని.

''మిగిలిన పావురాలను కూడా విడిపిస్తాను. అనుమానం లేదు. కాకపోతే చెప్పానుగా! పళ్ళు ఇబ్బంది పెడుతున్నాయని, నొప్పి అని. ముందు నిన్ను విడిపించనీ'' అని చిత్రగ్రీవుడి దగ్గరి వల తాళ్ళను కొరికే ప్రయత్నంలో పడబోయాడు హిరణ్యకుడు. చిత్రగ్రీవుడు అతనికి అందక వెనక్కి జరిగాడు. ఆశ్చర్యంగా చూశాడు హిరణ్యకుడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1478**

* * *

**Read other books of A.N.Jagannadha Sharma @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=A.N.Jagannadha+Sharma&id=50**